క్లుప్తంగా

జీపీఎస్‌ను రద్దు చేయాలి

సిద్దవటం : ప్రభుత్వ ఉద్యోగుల మీద బలవంతంగా అమలు చేయబోతున్న జీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఫ్యాప్టో వైఎస్ఆర్ జిల్లా భాగస్వామ్య సంఘం బీటీఏ వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరికొండయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాప్టో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండల కేంద్రమైన సిద్దవటం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల బయట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు


రాహుకాల పూజలో పాల్గొన్న మహిళలు

రాయచోటి : రాయచోటిలోని శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ అర్చకుడు శంకరయ్యస్వామి కుంకుమార్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డిలు పర్యవేక్షించారు.

గోపనపల్లెలో పొలంబడి కార్యక్రమం


గోపనపల్లెలో పొలంబడి కార్యక్రమంలో ఏఓ మురళీధర్

గాలివీడు : మండలంలోని గోపనపల్లె గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సాగు ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడి పెంచుకునే దిశగా సూచనలు, సలహాలు అందించారు. ఏ పురుగులకు ఏ మందులు వాడాలి, ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అలాగే రైతులకు పంట సాగులో సలహాలు, సూచలను అందించారు. కార్యక్రమంలో వీఏఏ అరుణ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టండి

ఓబులవారిపల్లె : రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొర్లకుంట పంచాయతీలో నిర్మిస్తున్న నూతన సిమెంట్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్ రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాయచోటి : ప్రధానమంత్రి నరేంద్రమోడీ 73వ జన్మదిన వేడుకలలో భాగంగా రాయచోటిలో బీజేపీ నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం రాయచోటి ఏరియా ఆసుపత్రి ఆవరణంలో పట్టణ అధ్యక్షుడు నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రాజంపేట పార్లమెంటరీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 యూనిట్ల రక్త సేకరణ శారు. కార్యక్రమంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ శివ గంగరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేపన్న శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీకేఎంయూ మహాసభలను విజయవంతం చేయండి

పెనగలూరు : బీకేఎంయూ 22వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం కోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు రేవూరి శంకరయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి కోరారు. శుక్రవారం పెనగలూరులో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ కార్యదర్శి షేక్ హాజీమాబీ, మండల కార్యదర్శి సన్ని, లక్ష్మీదేవి, నరసింహులు, రవి, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 నియోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహించారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె మండలాల నుంచి నాలుగు వందల మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కో–ఆర్డినేటర్ తులసి, వ్యాయామ ఉపాధ్యాయులు ఈశ్వర్‌నాయక్, అంజనీకుమార్, హమీద్, నాగరాజు, పెంచలమ్మ, సరిత, రిటైర్డ్ పీడీ ఎస్.షామీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

ఇంటింటి సర్వే ప్రారంభం


మాధవరం కస్పాలో వృద్ధుడికి బీపీ పరీక్షను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జగనన్న ఆరోగ్య సురక్షను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం ఈనెల 15వతేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో ప్రారంభమైంది. మాధవరం–1 విలేజ్ హెల్త్‌క్లినిక్ పరిధిలోని కస్పాలో రెండు ఆరోగ్య బృందాలు ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఇంటింటా సర్వే నిర్వహించాయి. సర్వేలో భాగంగా మాధవరం గ్రామ కస్పాలోని గృహాలను సందర్శించి కుటుంబంలో ఎవరికైనా బిపి, షుగర్, థైరాయిడ్ ఉన్నాయా? దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయా ? అని వివరాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలు, కౌమారబాలికలు ఉన్నారా ? లేరా ? అనే సమాచారాన్ని తెలుసుకున్నారు. అలాగే దృష్టిలోపం, దంత సమస్యలు ఉన్నాయా ? అని విచారించారు.

కుటుంబీకులకు ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉందా ? స్పర్శలేని మచ్చలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి బిపి, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అనే కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే 104 కాల్ సెంటర్ ద్వారా, విలేజ్ హెల్త్‌క్లినిక్ ద్వారా, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా అందుతున్న సేవల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి మొబైల్ ఫోన్‌లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అక్టోబర్ 6వ తేదీన మాధవరం జెడ్పీహైస్కూల్ ఆవరణంలో జరగనున్న జగనన్న సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, సీహెచ్‌ఓలు శిరోమణి, షహనాజ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

గాలివీడు : ప్రజల ఆరోగ్యం సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం ద్వారా ఇంటిలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది వాకబు చేసి వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేయాలి

నందలూరు (రాజంపేట): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి అన్ని సచివాలయాలలో జరగబోయే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సృజన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వే తీరును ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, టీబీ సూపర్ వైజర్ జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ'



మాట్లాడుతున్న ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం రాయచోటిలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాజేశ్వరి మాట్లాడుతూ గత 48 సంవత్సరాలుగా అంగన్‌వాడీలు తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మధురవాణి, ఓబులమ్మ, రమాదేవి, గౌరి, శ్రీవాణి, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటి అర్బన్ : పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీఎస్ అన్నమయ్య జిల్లా నాయకులు కె.యస్.రాజు, రవీంద్ర డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత, ఎంఎస్‌పి పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే విజయం


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో మానవత సంస్థ ప్రతినిధులు

సంబేపల్లి : కృషి, క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యార్థులు విజయాలు సాధించగలరని మానవత సంస్థ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బ్రహ్మానందరెడ్డిలు పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో సంబేపల్లి మండలం అడవి కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతమైన శిఖరాలను అధిరోహించగలరన్నారు. అలాగే విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం శెట్టిపల్లి గ్రామం, ఆంజనేయస్వామి గుడి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి వెంకటేష్, డైరెక్టర్ రామచంద్రారెడ్డి, సభ్యులు పేరయ్య, పెడబల్లి నాగభూషణం, పాలకుంట చినబాబు, హెడ్మాస్టర్ కె.వెంకటరమణ, టీచర్ శివారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పుల్లంపేట : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓ చక్రధర్‌రాజు తెలిపారు. పుల్లంపేటలో మండలస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. మండల స్థాయిలో విజేతలను ఎంఈఓతో పాటు నాగా తిరుమలరావు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో జరిగిన కబడీ, ఖోఖో, సాఫ్ట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్లు బాలశేఖర్, చంద్రకుమార్, పార్థసారధి, సాయిరాం, నీలకంఠ, కనకదుర్గ, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణ

పుల్లంపేట : పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. మెయిన్ రోడ్డు, నాగలపూరు గట్టు, శివాలయం వీధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మహాసభలు జయప్రదం చేయండి

రాజంపేట రూరల్ : విజయవాడలో ఈనెల 30, అక్టోబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే 17వ రెవెన్యూ మహాసభలలో ప్రతి ఒక్క రెవెన్యూ ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌డీఓ జి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ మహాసభల పోస్టర్లను ఏపీఆర్ఎస్ అసోసియేషన్ నాయకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్(ఏపీఆర్ఎస్) అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహకుమార్, తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, సీసీ కిరణ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుష్ఫలితాలపై ఫిర్యాదు చేయవచ్చు


మాట్లాడుతున్న గిరిరాజశేఖర్

రాజంపేట టౌన్ : ఔషధాలు ఉపయోగించాక ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్ 18001803024 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఫార్మసీ హెచ్ఓడీ డాక్టర్ డి.గిరిరాజశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం మందుల దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధాల ఉపయోగ సమయంలో, ఆ తరువాత జబ్బు నియంత్రణ జరిగిన తరువాత, శరీరంలో ఏవైనా మార్పులు, ఇతర అనారోగ్య లక్షణాలు సంభవిస్తే ఏఎంసీ సెంటర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సెంటర్ ఫార్మసీ కళాశాలలో, రిమ్స్‌లో కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించినందుకు అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, కార్యదర్శి చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.శిరీష, ఎం.ప్రమోద్‌కుమార్, డాక్టర్ ఎం.బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు



ఆంజనేయస్వామి ఆలయంలో బీరువా, హుండీ తాళాలు బద్దలుకొట్టిన దృశ్యం

గాలివీడు : మండలంలోని పలు ప్రాంతాల్లో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లను, దేవాలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. అందినకాడికి అపహరించుకుపోతున్నారు. గాలివీడు పెద్దచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరి జరిగినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఆలయంలోని హుండీ, బీరువా తాళాలు బద్దలు కొట్టి అందులోని నగదు, విలువైన వస్తువులు దొంగిలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే తరహాలో గత వారం గోరాన్‌చెరువు నల్లగుట్ట మలుపు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ బద్దలు కొట్టి నగదు దొంగిలించినట్లు ఆలయ పూజారి వెంకటస్వామి తెలిపారు. నెల రోజుల క్రితం అదే గ్రామంలోని వడిశలవంకపల్లెకు చెందిన గుర్రం బ్రహ్మానందరెడ్డి తన కుమార్తె వివాహం నిమిత్తం దాచుకున్న 20 తులాల బంగారం, రూ.3లక్షలు నగదు పట్టపగలే చోరీకి గురికావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు అవకాశం దొరికినప్పుడల్లా గ్రామాల శివారులో జనసంచారం లేని పంట పొలాల్లోని బోరు మోటార్లకు ఉండే విద్యుత్ తీగలను సైతం ఎత్తుకెళ్లి దొంగలు విక్రయించుకుంటున్నారు. దొంగలు పగలు వీధుల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టకపోవడం, కొత్తగా వస్తున్న వ్యక్తులపై కన్నేసి ఉంచకపోవడంతో వరుస చోరీలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అర్ధరాత్రి వరకు యువకులు, గుర్తు తెలియని వ్యక్తులు వీధుల్లో తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చోరీలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు జగన్

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


జెడ్పీ చైర్మన్‌తో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు

రాజంపేట టౌన్ : ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించేందుకు సీఎం ముసాయిదా బిల్లును ఆమోదించడం పట్ల స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు జెడ్పీ చైర్మన్‌ను కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నెరవేర్చారన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులకు ఎనలేని మేలు చేశారన్నారు. ఇప్పుడు జగన్ కూడా కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.చంద్రమోహన్, వై.నరసింహారెడ్డి, జయమ్మ, కవిత, జనార్ధన, సుజాత, శేఖర్‌బాబు, రవీంద్రబాబు, నగేష్‌బాబు, మస్తాన్, మాలతి, ఉదయ్‌కుమార్, గీత తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాకలో వైభవంగా మహా పూర్ణాహుతి


పూర్ణాహుతి కార్యక్రమంలో వేదపండితులు

రాజంపేట రూరల్ : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్లపాక గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయ పవిత్ర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీతో పాటు భక్తులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వేదపండితులు పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, నరేష్ వేద పారాయణం కృష్ణలు సంప్రదాయ బద్ధంగా మహా పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఐదో రోజు ఘనంగా గణేష్ నిమజ్జనం


నందలూరు : మేడా విజయభాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్ : రూ.1.65 లక్షలకు లడ్డును దక్కించుకున్న దశరథ


వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

నందలూరు (రాజంపేట) : మండలంలో వినాయకుని నిమజ్జన వేడుకలను ఐదోరోజు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని కాపు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమను ఎంపీపీ మేడా విజయ్ భాస్కర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓర్సు శ్రీనివాసులు, మట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 వేలు పలికిన లడ్డు వేలంపాట

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లికి చెందిన బెల్లంకొండ హరీష్ వేలం పాటలో రూ. 50 వేలతో లడ్డును దక్కించుకున్నారు. లడ్డును ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జాకీర్ చేతుల మీదుగా అందజేశారు.

గణపయ్యకు ఘన వీడ్కోలు

రాజంపేట టౌన్ : వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. గణనాథుని ఊరేగింపు సందర్భంగా భక్తులు బ్యాండు వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ, పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. కాగా పలు ఉత్సవ కమిటీలు తమ ప్రాంతాల్లో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రూ.1.65 లక్షలు పలికిన గణనాథుని లడ్డు

మండలంలోని బ్రాహ్మణపల్లెలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన లడ్డు వేలం పాట హోరాహోరీగా సాగింది. చివరకు కొమ్మి దశరథ రూ.1.65 లక్షలకు గణనాథుని లడ్డును దక్కించుకున్నారు.

రామాపురం మండలంలో..

రామాపురం : మండల కేంద్రంలోని నల్లగుట్టపల్లె గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి , సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణేష్ ప్రతిమను జాతీయ రహదారిపై మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాలు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి బెల్లగుట్ట చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే నీలకంఠ్రావుపేట, నాయునిచెరువు(అగ్రహారం), గాండ్లపల్లె, గాలంగుండ్లపల్లె తదితర గ్రామాలలో ఘనంగా గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రూ. 64వేలు పలికిన తూర్పుపల్లి లడ్డు

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం పంచాయతీ, తూర్పుపల్లి గ్రామంలో వినాయకస్వామి లడ్డు రూ. 64 వేలు పలికింది. గణపతి ఉత్సవాలలో భాగంగా తూర్పుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదాన్ని గురువారం రాత్రి వేలం పాట వేశారు. ఈ వేలంపాటలో పోటీలు పడి పాడటంతో చాపల హరిబాబు రూ. 64 వేలు పాటపాడి లడ్డును దక్కించుకున్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లి : మండలంలో దాదాపు 60 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేశారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి టౌన్‌తోపాటు జీజీరాజుపల్లి, అనంతపురం ఈడిగపల్లి, మద్దిరేవుల, కాకులవరం, పాలెం గొల్లపల్లి, లక్కిరెడ్డిపల్లి గ్రామాలలో 20కి పైగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

వీరబల్లి (రాజంపేట) : మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ, షికారుపాలెంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ గోపినాథ్ రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి మదన్ రెడ్డి, ఎంపీటీసీ సుబ్బరామరాజులు హాజరయ్యారు. భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వినాయక ప్రతిమను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు నాయక్, బంజారా నాయకుడు శంకర్ నాయక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.75 వేలు పలికిన లడ్డు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఎంజీపురంలో నిర్వహించిన వినాయకుడి లడ్డు వేలంపాటలో గ్రామానికి చెందిన కొండూరు వెంకటేశ్వరరాజు రూ. 75వేలకు లడ్డును దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండూరు విశ్వనాథరాజు, గ్రామ ఉప సర్పంచ్ కొండూరు రుద్రనారాయణరాజు, ఎంపీటీసీ ఎ.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : సిద్దవటంలోని ఆకులవీధి, కుమ్మరివీధి, భాకరాపేట, ఎస్‌కేఆర్ నగర్, వడ్డివారిపల్లె, పేరయ్యగారిపల్లె గ్రామాల్లో శుక్రవారం వైభవంగా వినాయక నిమజ్జనం నిర్వహించారు.


నందలూరు : వేలంపాటలో లడ్డును దక్కించుకున్న బెల్లంకొండ హరీష్


రాజంపేట టౌన్ : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


రామాపురంలో అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు


పెనగలూరు : తూర్పుపల్లిలో లడ్డుప్రసాదాన్ని రూ. 64వేలకు దక్కించుకున్న హరిబాబు


రాజంపేట రూరల్: రూ. 75 వేలకు లడ్డును దక్కించుకున్న కొండూరు వెంకటేశ్వరరాజు